అమ్మ చాలా మంచిది

ప్రొద్దుటే ఏదో పనిమీద మేడమీద వరండాలోకి వచ్చిన యాలిస్ అలాగే నిలబడిపోయింది. జనవరి నెల. మంచు బిందువుల్ని యింకా పూర్తిగా సూర్యకిరణాలు జయించలేదు. పైనుంచి చూస్తే యిటూ అటూ పేర్చబడిన కుండీలలోని తెల్ల చామంతిపూలు చల్లనిగాలికి మెల్లగా ఊగుతున్నాయ్. దూరంగా ఉన్న పున్నాగ పుష్పాలు తమాషాగా ఒకటీ ఒకటీ నేల రాలుతున్నాయ్. పాత స్మృతులు మనసును కలవరపెట్టి యాలిస్ కళ్ళు అశ్రుపూరితా లయినాయి. దృశ్యమంతా మసక మసకగా కనిపించింది.

'పువ్వులంటే అంత యిష్టమెందుకమ్మా నీకు యాలిస్?' మిస్సమ్మ రాక యాలిస్ ఆలోచనలకి అంతరాయం కలిగించింది. ఆమె మొహాన్ని మిస్సమ్మ బలవంతాన తనవైపు తిప్పుకుంది. దగ్గిరగా లాక్కొని గట్టిగా ముద్దెట్టుకుంది.

'నా బంగారు తల్లి? ఎంత చక్కటిదానివమ్మా! నా బిడ్డ 'రోజ్' బతికుంటే సరిగ్గా యింత వయస్సుదీ అయ్యేది' మిస్సమ్మ అయిదునిమిషాలు నిశ్శబ్దంగా దుఃఖించింది.

'అయితే యాలిస్, నువ్వింక పెళ్ళిచేసుకో వేమిటమ్మా? ఇంత చిన్న వయస్సులో యింత వేదాంతం నీ కెలా అలవడిందీ?'

యాలిస్ మనసు కలవరపడింది. ఈ 'గుడ్ ఫ్రైడే'తో తనకు యిరవై మూడేళ్ళు వెడతాయి. ఈ వయస్సులో తన కీ వేదాంతం ఏ ఆశయ సిద్ధి కోసం ?

మిస్సమ్మ ప్రశ్నల కెప్పుడూ యాలిస్ మౌనమే సమాధానం. సమాధానం చెప్పకుండా యాలిస్ తనగదిలోకి గబగబా నడిచింది. గదితలుపు

వేసింది. పెట్టితీసి అందులోంచి చిన్న దంతపు భరిణ తీసింది. అందులో సొమ్ము లెక్కపెట్టుకుంది. అయిదు వందల రూపాయిలు ? ఆరేళ్ళ కృషి!

యాలిస్ గది బయటకు నడిచింది. గది తలుపు తాళం వేసింది. మేడ మెట్లు దిగి క్రిందకు వచ్చింది. చల్లగాలికి ఎగురుతున్న మఫ్లరును దగ్గిరగా బిగించుకుంది. జెంకిస్ మొక్కలనూ క్రోటన్సు మొక్కలనూ దాటింది. అందంగా కత్తిరించిన పూ లతలనుదాటి ఒక ఫర్లాంగు నడిచింది. మళుపు తిరిగి చిన్న టర్నింగు గేటులోంచి చర్చిలోకి ప్రవేశించింది. చర్చికి ముందుగానే మనస్సులోని సకల మాలిన్యాలనూ ఒక్కచూపుతో పోగొట్టే చలువరాతి శిలావిగ్రహం కనిపించగానే యాలిస్ మనస్సు ప్రశాంతతతో నిండిపోయింది. చుట్టూఉన్న ఎర్రబంతి ఆవరణను దాటి కరుణ చిందించే ఏసుక్రీస్తు దయాస్వరూపాన్ని అయిదునిమిషాలు రెప్పవాల్చకుండా చూసింది. ఆమె కళ్ళలోంచి రెండు కన్నీటి చుక్కలు పాలరాతి విగ్రహం పాదాలపై పడ్డాయి.

'నీ నీడనే పుట్టిపెరిగాను ఏసు ప్రభూ! కరుణ కాంతులను వెదజల్లే నీ నిమీలిత నేత్రాలను ఒక్కరోజు చూడకపోతే నా మనస్సు బాధపడి పోయేది. ఇంత అర్థస్ఫురితంగా నిన్ను ఏ చిత్రకారుడు సృజించాడో! నీ చలవవల్ల, నీ చల్లని దీవనవల్ల ఈ నెలతోనే అనుకున్న అయిదు వందలూ పూర్తయాయి. అన్యాయంగా వంచించబడ్డ నాలాంటి దీనులు యికముందు నీ ముందు దుఃఖించకూడదు. నాలుగు గోడలమధ్య చిన్న గదిలో చెప్పలేని భరించలేని లెక్కలేని రాత్రులు పలకరించే చిన్న ప్రాణి లేక నే నిక గడపలేను.' ఒళ్ళంతా పులకరించే తియ్యని ఆలోచనతో ఆమె కళ్ళు తళతళ మెరిశాయి.

'వస్తాడు. తప్పకుండా నా బాబూ నా దగ్గిరికి వస్తాడు. 'అమ్మా' అని నన్ను పిలుస్తాడు. ఈసారి నీ దగ్గిరకి నే నొక్కర్తినీ రాను. ఆ పాల

మీగడని, ఆ లేదూడని, ఆ తేనె చినుకుని, ఆ పనసతొనని వెంటబెట్టుకుని వస్తాను. ఆ లేతచేతులు నీకూ నమస్కారం చేస్తాయి ఏసు ప్రభూ!'

చర్చిలో గంటలు విని యాలిస్ త్రుళ్ళిపడింది.

'అమ్మయ్యో, ఎనిమిదీ! ఆస్పత్రికి టైమయిపోయింది' రుమాలుతో కన్నీళ్ళు తుడుచుకుని యాలిస్ త్వరత్వరగా తిరుగుమొహం పెట్టింది.

* * * *

ఏడేళ్ళు వెనక్కి తిరిగి చూడగలుగుతే, ఆనాడు యాలిస్ అనాథ శరణాలయంలోనే ఉంది. మరియమ్మ ఎందుకో త్వరత్వరగా వచ్చింది. బంతినారు జల్లుతున్న యాలిస్ తలెత్తి చూసింది.

'దొరసానమ్మగారు నిన్ను త్వరగా రమ్మంటున్నారే—ముందుగా రా, కోపంగా ఉన్నారు కూడాను.' కొళాయి దగ్గిర చేతులు కడుక్కుని ఆఫీసు రూంలోకి పరిగెట్టింది. అక్కడ దొరసానమ్మా, ప్రక్కని సెక్రటరీ మార్గరెట్ జోన్సూ ఉన్నారు. చుట్టూ తన సహచారిణులు మేరీ, సంతోషం, మేక్ మిల్లన్, రాషెల్ మొదలయిన వారంతా తనవైపే చూస్తున్నారు. యాలిస్ చేతులు కట్టుకు నిలబడింది. జోన్సు మొదలు పెట్టింది.

'మొన్న మీ రిజల్ట్సువచ్చాయి తెలుసా? నువ్వుతప్ప అందరూ ప్యాస య్యారు. నువ్వీ జూనియర్ క్లాసులోనే ఏళ్ళకొద్దీ ఉండిపోతే మెట్రిక్ ఎప్పుడు ప్యాసవుతావు? మన క్రిస్టియన్సుకి ముందు ముందు ఎన్ని ప్రోస్పెక్టస్ అయినా ఉన్నాయి. మన అనాథ శరణాలయంనుంచి వెళ్ళిందే డార్లీ—యిట్టే బియ్యే యూనివర్సిటీ ఫస్టుగా ప్యాసయింది. ఈ ఆర్ఫనేజ్ రూల్సు నీకు తెలుసుగదా! ఇంక థర్డియర్ ఛాన్సు ఉండదు. విలువయిన కాలాన్ని యిలా పాడుచేసుకుంటే — ఆదుకోడానికి నీకేం తల్లా, తండ్రా?' మార్గరెట్ జోన్సు యీ మాట అందరికీ ఎప్పుడూ జ్ఞాపకం చేస్తూఉంటుంది. పెద్ద దొరసాని యీ మాటకి ఎప్పుడూ కోప్పడుతూనే ఉంటుంది.

'తల్లీ త్రండీ ఉంటే యిక్కడి కెందుకొస్తారమ్మా?—చూడు యాలిస్—నీకన్న చిన్నవాళ్ళుకూడా జూనియర్ స్టేండర్డ్ ప్యాసవుతున్నారు. ఎప్పుడూ పూలమొక్కలకి నీళ్ళు పోస్తూనో, లేసులు అల్లుతూనో కూర్చుంటే ఎలాగమ్మా? మరేం ఫరవాలేదు చదువు, తప్పకుండా ప్యాసవుతావు - ఇక వెళ్లు' యాలిస్ తన రూంకి వచ్చేసింది. బరువయిన మనస్సుతో కుర్చీలో కూలబడింది. గంట గణగణ మోగింది. రూంమేటు సంతోషం ఒకచేత్తో సబ్బూ, ఒకచేత్తో మొహం తుడుచుకుంటున్న తువ్వాలుతో అక్కడి కొచ్చింది.

'ఫైవ్ తర్టీ అయింది—ఇప్పుడేం గంట?' అంది యాలిస్. సంతోషం 'వాట్ హెయిర్' తమాషాగా దువ్వుకొంటూ అంది.

'అదేమిటే? నువ్వు పిక్చరుకి రావూ? నిన్నే రిజల్ట్సు వచ్చాయిగా! సరదాగా అందరం సినిమాకి వెడుతున్నాం. ఇప్పుడు కొట్టింది మీల్సుకి గంట. అందరం భోంచెయ్యాలి, వెళ్ళాలి. లే, డ్రెస్ చేసుకో.'

ఆఖరికి దొరసానమ్మే స్వయంగా వచ్చి ప్రతిమాలినా యాలిస్ 'నేను రాను' అనేసింది. మూప్పావు గంటలో ఆర్ఫనేజ్ అంతా ఖాళీ అయిపోయింది. దూరంగా ఒక్కరో యిద్దరో వాచ్‌మెన్, ఇల్లు క్లీన్‌చేస్తున్న పెద్ద వంట మనిషీ తప్ప హాస్టలంతా నిర్మానుష్యమయిపోయింది.

గదిలో లైటు వెలిగించుకుని యాలిస్ ఆలోచిస్తూ పడుకుంది.

ఆరునెలలకి ఒక్కసారి ప్రిన్సుపాలు సినిమాకు పంపుతుంది. సినిమాలంటే తన కెంత సరదా అయినా ఈ రోజు తన మనసు మళ్ళించలేకపోయాయి.

'ఇంత చిన్న పరీక్షలో తనెందుకు ఫేలయినది?—లెక్కలంటే అంత తలనొప్పిగానూ యింగ్లీషు గ్రామరంటే అంత చికాకుగానూ తన కెందుకుండాలి? టీచరు లెసన్ చెప్తున్నంతసేపూ తన దృష్టి డాక్టరు గులాబీ

మీదో, సీతాకోక చిలుకమీదో ఎందుకు పోవాలి? ఇలా మరోఏడు తప్పితే తనేమైపోవాలి' 'ఆర్ఫనేజీలో ఉన్న పిల్లలకి చప్పున కన్నీళ్ళురావు. తల్లీ, తండ్రీ లేనివాళ్ళమని వాళ్ళకి ముందే తెలుసు. అందుకనే మనసు బాధించినా యాలిస్‌కి కన్నీరు రాలేదు. పదహారేళ్ళు పైబడిన తనే అలా దుఃఖిస్తే తన వెనక చిట్టి చెల్లాయిలు ఏమైపోవాలి? అమ్మెవరో ఎరగని పురిటిబిడ్డలు ఎంతని దుఃఖించాలి?

యాలిస్ రూం తాళంవేసి యివతలి కొచ్చింది. గార్డెన్‌లోకి వచ్చింది. రోడ్డుకి యిరువైపులా వేసిన బొగడబంతిపూలు తన్ని వెక్కిరిస్తున్నాయ్. లేత వెన్నెల, సన్నని మధురమైన స్వరంలా ఆనందాన్నిస్తోంది. ప్రక్కనే విరియబూచిన నైట్‌క్వీన్ చక్కని, సున్నితమైన వాసన ఎక్కడెక్కడికో తీసుకుపోతోంది.

'నాకూ, యీ పువ్వులకూ ఏమిటీ అనుబంధం ?' అనుకుంది యాలిస్. అలా అంతూ దరీలేని ఆలోచనలతో కాంపౌండ్‌వాల్ వరకూ నెమ్మది నెమ్మదిగా వెళ్ళిపోయింది. 'రంయ్' మని అతి స్పీడుతో ఒక కారువచ్చి పెద్ద చప్పుడుతో యించుమించు గేటుదగ్గిర ఆగిపోయింది. యాలిస్ దూరంనించి చూసి 'ట్యూబ్ బరస్టు అయినట్టుంది' అనుకుంది. అందు లోంచి ఒకవ్యక్తి దిగేడు. 'మరో ట్యూబ్ ఉంది కాబట్టి సరిపోయింది—లేకపోతే ఏమౌనో?' అని అతను గొణుక్కోడం యాలిస్ వినకపోలేదు. కొంతసేపటిలో అతను 'కారు' లైట్ చేసుకున్నాడు.

సన్నని—సన్నజాజి పరిమళం లాంటి—లేత వెన్నెల.

'ఎవరక్కడ?' అంటూ అతను యాలిస్‌మీద బ్యాటరీ లైటు వేశాడు. వెంటనే నాలుక కరుచుకొని—

'అయాం సారీ, ఎవరో అనుకున్నాను' అన్నాడు.

'ఫరవాలేదు' అంది యాలిస్ తనలో తానే అన్నట్టు.

'ఈ కనపడుతున్న బిల్డింగ్ ఏమిటి?'

'లేడీస్ ఆర్ఫనేజ్' అంది యాలిస్.

'సిటీ ఇంకా ఎంత దూరం?'

'నాలుగు మైళ్ళు ఉంటుంది.'

ఇక్కడెక్కడేనా మంచినీళ్లు దొరుకుతాయా?'

'నే తెస్తాను, యిక్కడే ఉండండి'. యాలిస్ లేడిపిల్లలా లోనికి పరిగెత్తింది. ఈలోగా ఆ యువకుడు సైనాక్యులర్సు తీశాడు. యాలిస్‌వైపు సారించాడు.

'ఎంత అందం! ఏమి సోయగం' అనుకున్నాడు. యాలిస్ మంచినీళ్లు తెచ్చిఇచ్చింది. రెండు గుక్కల్లో అతను మరచెంబుడు మంచినీళ్ళు తాగి, అదోలా ఆమెవైపు చూస్తూ 'నా దాహం తీర్చారు. మీ కెలా కృతజ్ఞత తెలపాలో తెలియడంలేదు. చల్లనిగాలి—చిక్కటి వెన్నెల—కారుమీద అలా ఓసారి సిటీలోకి రాడానికి మీకు అభ్యంతర ముండదేమో!' యాలిస్ అతనివైపు తేరిపారి చూసింది.

ఉంగరాలు తిరిగిన జుత్తు—పెంకితనంగా, మత్తెక్కించేటట్లుగా తన వైపే చూస్తున్న ఎట్టటి కళ్ళు—క్రింది పెదవిని నొక్కిపట్టిన పళ్ళు—సిల్కు చొక్కా, ట్వీడుపేంట్, బంగారపువాచీ, జేబులో చేతులు—ఎవరితను? తనకీ యితనికీ ఏం సంబంధం? తన్నెందుకు పిలవాలి?

పురుష సాంగత్యం ఎరగని యాలిస్ కన్నె మనస్సులో ఏం గిలిగింతలు కలిగాయో తెలియదు. మంత్రముగ్ధలా అతని వెనుకే వెళ్ళి కారు వెనక సీటులో కూర్చుంది. కారు కదిలింది.

* * *

యాలిస్ పరిగెత్తింది. సముద్రతరంగాలలో ఉయ్యాల లూగుతున్న చందమామకన్న త్వరగా పరిగెత్తింది. చల్లని సముద్రపుగాలికి ఆమె

ముంగురులూ, దుస్తులూ—వీటితో పాటు దేనికో భయపడుతూ ఆమె మనస్సూ ఊగులాడుతున్నాయి. అతను తొందరగా పరిగెత్తివచ్చి తన్ని పట్టుకున్నాడు.

'వద్దు - ఇప్పుడొద్దు - నన్ను క్షమించండి - వ ద లం డి' యాలిస్ పెనుగులాడింది. అత డామెను విడిచేశాడు.

'సరిపడే హృదయంకోసం, దేశాలు గాలిస్తున్నాను. సామీప్యంలోనే ఉందని తెలుసుకోలేకపోయాను. ఈ నాడు నువ్వు దొరికేవు. నిన్ను విడిచి క్షణం బ్రతకలేను. తుచ్ఛమైన శరీర సుఖంకోసం నే నేనాడూ వాంఛించలేదు. వివాహమయ్యేవరకు నిన్ను తాకనని మాట యిస్తున్నాను.'

యాలిస్ తల ఎత్తి అతనివైపు చూసింది. ఎట్టబడ్డ కళ్ళు ఎందుకో బాధపడుతున్నాయ్. ఎత్తైన ఛాతీ దేనికో క్రుంగిపోతోంది. నిర్మలమైన అతని మొహంలో పాపపు తలంపుగాని, మోసబుద్ధిగాని యాలిస్‌కు సూచనగానైన కనిపించలేదు. మరుక్షణంలో యాలిస్ అతన్ని దగ్గరగా తీసుకుంది.

'నేను పాపిష్ఠిదాన్ని. మిమ్మల్ని శంకించాను. క్షమించండి.' అత డామె ముంగురులను సవరించాడు. ఇసకలో చేతికి దొరికిన రాయిని తమాషాగా సముద్రంలో విసిరేడు. కెరటాలూ, చంద్రుడూ మరింత కంపించాయి.

* * * *

ఇంకా తెల్లవారలేదు. యాలిస్ అడుగుల్లో అడుగులు వేసుకుంటూ ఆర్ఫనేజ్ ఆవరణలోకి వచ్చింది. ఇన్నాళ్ళూ తనలో మా న వ త్వ ం నిద్రించినట్టూ - గడచిన రాత్రే మేల్కొని సఫలమైనట్టూ - యాలిస్‌లోని ప్రతి నరం పాటలు పాడుతున్నాయి. రాత్రి కురిసిన మంచుబిందువులు ఆమె కాళ్ళను ముద్దిడుతున్నాయ్. ప్రక్కనేవున్న రెండు తెల్ల గులాబీల జంట యాలిస్‌కు రోజూకన్న అందంగా కనిపించింది. మళ్ళు తిరిగి చిన్న

కాలిబాటద్వారా చర్చి చేరుకుంది. ఏసుక్రీస్తు శిలా విగ్రహానికి మనసారా నమస్కారించింది. 'నాకు తెలిసినంతవరకు నా తల్లి, తండ్రి నీవే ఏసుప్రభూ !—నా స్త్రీజన్మ రహస్యమేమిటో నిన్ననే అర్థమయింది. నీ కేమని చెప్పను ప్రభూ !' యాలిస్ ఎదురుగా ఎవరో మనిషి ఉన్నట్టు సిగ్గుపడింది. తిరిగి తలెత్తి విగ్రహాన్ని చూడలేకపోయింది. తిరిగి ఒక్క నమస్కారంపెట్టి ఆర్ఫనేజ్ చేరుకుంది. ఫ్రెండ్సందరూ ఆమెను మూగిపోయేరు.

'ఎక్కడి కెళ్ళేవే యాలిస్ ?'

'రాత్రి తొమ్మిది దాటితే కాంపౌండు వాల్సు దాటి ఎరుగుదుమే ? నీ గురించి జోన్సు చేస్తున్న హడావిడి యింతా అంతా కాదు !'

'అంత అవసరముంటే పర్మిషన్ తీసుకు వెళ్ళవలసింది !'

ఇంతలో మార్గరెట్ జోన్సు అక్కడ కొచ్చింది.

'అనాధ శరణాలయమంటే - తల్లీ తండ్రీ లేని చిన్న పిల్లలకు. అంతేకాని వారిని పెద్దచేసి మళ్ళీ పిల్లల్ని కనే వయస్సుదాకా పెంచమని కాదు. ఈ విషయంలో ఈ ఆర్ఫనేజ్ స్థాపించిన మేడమ్ ఎమిలీ పొరపాటు చేసిందనే నా ఉద్దేశ్యం. ఫ్రీగా ఎడ్యుకేషన్ దీనితో జోడించడమే ఆవిడ చేసిన పెద్ద పొరపాటు. రెక్కలొచ్చిన పక్షులనూ, వయస్సొచ్చిన పిల్లలనూ పట్టడం కష్టమే మరి !' ఎవరూ ఏం మాట్లాడలేదు.

'పెద్ద దొరసానమ్మ వచ్చి స్వయంగా బ్రతిమాలినా నువ్వు పిక్చర్‌కి రాలేదు. వేరే నీకు ఎంగేజిమెంట్సు ఉన్నాయని మాకు తెలీదు - అది సరే. మిగిలినవారి కేరక్టర్ సరిదిద్దడానికయినా నువ్వీ ప్రశ్నకి జవాబు చెప్పవలసి ఉంటుంది. వయస్సు వచ్చిన నువ్వు - ఒక రాత్రి పూర్తిగా వేరే గడిపేవు. ఎక్కడ గడిపేవో సూటిగా, దాచకుండా జరిగిందంతా చెప్పాలి.

యాలిస్ ఏమీ భయపడకపోవడం, నిర్భయంగా, నిశ్చలంగా జవాబు చెప్పడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

'దాచవలసిన విషయమేమీలేదు – నేను అంతా, స్వయంగా, దొరసానమ్మగారికే నివేదించుకుంటాను.' ఆ మాట అనేసి యాలిస్ త్వరత్వరగా రూంలోకి వెళ్ళిపోయింది. తలుపు వేసుకుని మంచంమీద పడి కాళ్ళూ చేతులూ ఆనందంతో కొట్టుకుంది.

*　　*　　*　　*

'జరిగినది యిది అమ్మగారూ! నన్ను క్షమించాలి. ఆయన పేరు ప్రసాద్. వైజాగ్‌లో మిల్ ఓనర్ కుమారులు. యం. బి. ఫైనలుయియర్ చదువుతున్నారుట. అన్నీ ముందే కనుక్కున్నాను అమ్మగారూ! ఒకటి రెండు నెలలలో మంచి ముహూర్తం చూసి నన్ను మేరేజ్ చేసుకుంటానని చెప్పేరు. మీ దగ్గిర ఎప్పుడూ ఏమీ దాచలేదు.' యాలిస్ సిగ్గుతో తల దించుకుంది.

దొరసానమ్మ ప్రేమగా ఆమె తల నిమురుతూ అంది.

'నువ్వు తొందరపడి పోయావేమో నమ్మా యాలిస్! ఆర్ఫనేజ్ గేటు దాటి ఎరగవు. నీకు ప్రపంచజ్ఞానం ఎంతుంది? లోకంలో అందరూ మంచి వాళ్ళే ఉండరమ్మా! ఆడపుట్టుక అల్లకల్లోలమైన సముద్రం. లభించేది చంద్రోదయమో, అమావాశ్య చీకటో మనకి అర్థం కాదు. జీవితంలో మచ్చ పడి బ్రతకడం చావుకన్న కనాకిష్టం – చిన్న దానివి. నిన్ను పెద్దపెద్ద మాటలాడి బెదిరిస్తున్నానేమో! మరోలా అనుకోకు. ఏసు ప్రభువు నిన్ను కరుణిస్తాడు. త్వరలో నీ మేరేజ్ పార్టీకి వస్తాను. విష్ యు గుడ్ లక్!' ఆనందంతో ఆకాశయానం చేస్తున్న యాలిస్‌కి ఇవన్నీ అర్థం కాలేదు. ఆఖరి ముక్కకి మాత్రం బుగ్గలు ఎఱ్ఱపడి, నోట్లో జేబురుమాలు కుక్కుకుని రూంనుంచి ఇవతలి కొచ్చింది. అక్కడ 'సంతోషం' ఎదురైంది.

'నీ దగ్గిర ఎప్పుడూ ఏమీ దాచలేదు సిస్టర్: జరిగినది యిది...' యాలిస్ అంతా చెప్పింది. సంతోషం ఏమీ సంతోషించ లేదు.

'అందరి మనసులూ నీ అంత ఉన్నతంగా, నిష్కల్మషంగా ఎందుకుంటాయి యాలిస్ ? అతని కులం ఏమిటి ? మన కులం ఏమిటి ?'

యాలిస్ దీనికీ భయపడలేదు. కళ్ళుమరింత అందంగా పెద్దవిచేస్తూ అంది.

'ఆయన మాటలు వింటే నువ్విలా అనుకుంటావా సంతోషం ? — 'కులమూ, మతమూ, డబ్బూ, సంఘమూ, బంధువులూ మనల్ని విడదియ్యగలవా యాలిస్ ? మబ్బులన్నీ ఏకమైనా చంద్రుడి నుంచి కాంతిని వేరు చెయ్యగలవా ?' దీని కేమంటావ్ సిస్టర్ ?'

'ఉపమానాలు బాగానే ఉన్నాయి. నాకేమో భయంగానే ఉంది. ఏమైనా తొందరపడిపోయావు సిస్టర్ !'

సంతోషం కూడా యిలాగే అంటుంది. తను నిజంగా తొందరపడిపోయిందా ? అద్దంలో తల దువ్వుకుంటూ మరొకసారి తన్ను తాను ప్రశ్నించుకుంది యాలిస్. అద్దాన్ని ముద్దెట్టుకుంది.

రాత్రి అవుతోంది. నైట్ క్వీన్ పరిమళిస్తోంది. చంద్రుడు ఆకాశంమీద కొస్తున్నాడు. కారు హారన్ వినపడింది. యాలిస్ చేతిలో రిబ్బన్ జారిపోయింది.

*   *   *   *

చిన్న చిన్న గాడ్పులు ప్రారంభించాయి. మల్లెమొక్కలన్నీ చిన్న చిన్న మొగ్గలు పెడుతున్నాయి. పక్షులు తమాషాగా అరుస్తున్నాయి. కారు హారన్ వినిపించింది. యాలిస్ త్వరత్వరగా రూంలోనికి పరిగెత్తింది. సరిగ్గా రూందగ్గిర దొరసానమ్మ అడ్డంగా నిల్చుంది.

'నీ పద్ధతేం బాగులేదు. ఇవాళ ఏదో ఒకటి తేలిపోవాలి. నాతో రా'

ఆవిడ కళ్లుచూస్తే యాలిస్‌కి భయం వేసింది. ఆవిడ వెనకగా నడిచింది. దొరసానమ్మ యాలిస్‌ను తన ప్రైవేటు రూంకి తీసికెళ్ళింది.

'వయస్సులో ఉన్నదానివనీ, చిన్నదానివనీ నీ మొదటి తప్పును నేను క్షమించాను. కాని నిన్ను ప్రకృతి క్షమించలేదు. నీకు మూడవమాసమని జోన్సు అనుమానిస్తోంది. నిజమేనా ?'

యాలిస్ మాట్లాడలేదు. బొటన వ్రేలితో నేలని రాస్తూ ఊరుకుంది.

'నువ్వీ పరిస్థితులలో నీ ఫ్యూచర్ నిర్ణయించుకోకపోతే నిన్ను నువ్వే మోసపుచ్చుకొన్న దాని వౌతావు. లోకం రహస్యంగా ఎన్ని తప్పులు చేసినా భరిస్తుంది, కాని ఋజువయిన, కళ్ళబడిన నేరాన్ని క్షమించదు. ఇదివరకు సౌమ్యమైన నీ ప్రవర్తన బట్టి — యీ మూడు నెలలూ నిన్ను ఉపేక్షించాను. నాలుగు నెలలు యిట్టే గడిచేయి. ఎంత సరిదిద్దుకున్నా, సమర్థించుకున్నా — నువ్వింక యిక్కడ ఉండడానికి రూల్సు ఒప్పుకోవు. నువ్వు యివాళే రూం ఖాళీ చెయ్యవలసి ఉంటుంది.' దొరసానమ్మ కాలింగ్ బెల్ నొక్కింది. జోన్సు వచ్చింది. 'నువ్వు యీ విధంగా యిక్కడనుంచి వెళ్ళడం మా కందరికీ విచారంగా ఉంది. శత్రువులను సహా క్షమించే ఏసు ప్రభువు నిన్ను కరుణించుగాక!' ఏలిస్ దొరసానమ్మకు నమస్కారం పెట్టింది. కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగేయి. ఆమె రూం చేరుకుంటూంటే చుట్టూ నవ్వులూ, గుసగుసలూ వెక్కిరించాయి. ఆమె రూం చేరుకుంది. సంతోషం ఆమెను కౌగలించుకుంది.

'నువ్వు చేసింది తప్పుకాదు సిస్టర్ ! కోర్కెలను బలవంతాన అణుచుకోవడమే వ్యభిచారం. త్వరలో నీనుంచి శుభలేఖ వస్తుందని ఆశిస్తున్నాను.'

యాలిస్ అందరికీ నమస్కారం పెట్టింది. తను పెంచిన మొక్కల్నీ లతల్నీ కష్టంగా, కన్నీళ్ళతో విడిచింది. చాలామంది గేటుదాక వచ్చారు. ప్రసాద్ మొహంలో రంగు రంగులు ఆమెను ఆశ్చర్యపరిచాయి.

'ఏమిటీ సామాను ? వీళ్ళంతా ఎవరు ?'

'అంతా చెప్తాను ఎక్కండి' అతను సామానంతా కారులో పెట్టేడు. అందరూ గుడ్‌బై చెప్పేరు. కారు కదిలింది.

ఎంత ఆపుకుందామన్నా యాలిస్‌కి దుఃఖం ఆగలేదు. ప్రసాద్ ఆశ్చర్య పోయాడు. అత దామె కన్నీళ్ళను తుడిచాడు.

'ఏమిటది ? ఎందుకా ఏడుపు ?'

'నేను మొదటినుండీ ఆశ్రయం లేనిదాన్ని. అనాధ శరణాలయంలో పెరిగేను. మీరు నా జీవితంలో ప్రవేశించారు. నన్ను నిరాధారను చేస్తా రేమో అనే భయం నిత్యం వెన్నంటుతోంది.' ప్రసాద్ ఆమెను దగ్గరగా తీసుకుని బుజ్జగించాడు.

'నీకా భయం ఎందుకు కలిగింది ?'

'మీ రెవరో నాకు తెలీదు. మీ మాటలన్నీ నమ్మేను. నా శరీరం, మనస్సు మీకు అర్పించేను. మూడు నెలలు గడిచాయి. మీరు నన్ను పెళ్ళి చేసుకోలేదు. అది పవిత్రమైన బాలికల్ని పెంచి విద్యాబుద్ధులు చెప్పించే సంస్థ. నాలాంటి గర్భిణికి...'

ప్రసాద్ మొహం క్షణం సేపు రక్తవిహీనమైంది. యాలిస్ రెండు చేతులతో అతని బుగ్గల్ని సవరిస్తూ అంది.

'దీనికి మీరు చింతించ నక్కర్లేదు—మీరు నన్ను మీదాన్ని చేసుకుంటే నా కెవరి నిందలూ బాధించవు. నాలో పెరిగిన మీ రూపం నన్నేమాత్రమూ బాధించలేదు. ఇవాళ మీ యింటికి నన్ను తీసుకెళ్ళకపోతే ఒప్పుకోను మూడు నెలలు – నే నెంత బాధపడ్డానో మీకు తెలియదు.—ఇంక నే ఊరుకునేది లేదు. మనకి ముహూర్తాలక్కర్లేదు. రిజిష్టరీ మ్యారేజ్ చేసుకుందాం.' యాలిస్ అతని కళ్ళలోకి చూస్తూ అంది. అతని కళ్ళు యాలిస్ భావాల్ని సమాధాన పరిచేవిగా లేవు. కారు ఆగింది.

'దేనికి ఆపుచేశారు ?'

'నువ్వు యిన్నాళ్ళూ ఒకచోట ఉన్నావని ధైర్యంగా ఉండేది. వాళ్ళంత త్వరగా నిన్ను పంపించేస్తా రనుకోలేదు.'

యాలిస్‌కి అర్థమవలేదు.

'నా కేమిటో భయంగా ఉంది. ఏమిటి మీ భావం, చెప్పండి !'

'మనం చిన్నవాళ్ళం. పెద్దవాళ్ళ భావాలు మన భావాల వలెనే ఉండవు.'

'ఇప్పు డే మొచ్చింది ?'

'ని న్నీ పరిస్థితులలో మా యింటికి తీసుకెళ్ళడానికి కుదురదు. ఎక్కడికి తీసుకెళ్ళనా అని ఆలోచిస్తున్నాను.'

యాలిస్ గుండె తీవ్రంగా కొట్టుకుంది. ఆమె మొహం ఎర్రబడింది. పెదవులు వణికేయి.

'ఏమిట మీ ఉద్దేశం ? నన్నేం చేదామని ? ముందే అన్ని సంగతులూ చెప్పకుండా నన్నెందుకు మోసపుచ్చేరు ?'

'నిన్ను మోసం చేద్దామని నా కెన్నడూ లేదు యాలిస్ ! ఇప్పటికేనా నా అందాల రాశిని — నానుంచి ఎవ్వరూ వేరు చెయ్యలేరు!' యాలిస్ కంటి కొలుకుల్లో నీటిని అతను తుడిచాడు. యాలిస్‌కి ధైర్య మొచ్చింది.

'మరెందు కలా అంటారు ? మన యింటికి పోదాం పదండి.'

'అదే ఎలాగో యిన్నాళ్ళూ ఆలోచిస్తున్నాను. మా అమ్మా, నాన్న గారూ నవీన భావాలు కలవారే గాని మా మేనత్త చండశాసనురాలు. లోకం పోకడ నీకు తెలీదు యాలిస్. నువ్వు క్రిష్టియన్‌వి. తల్లీ తండ్రీలేని అనాధవి. అనాధ శరణాలయంలో నుంచి వచ్చినదానివి. వీటన్నిటినీమించి గర్భిణివి. ఇలాంటి విషయాలు మన మనస్సులకు దూదిపింజెలు. కాని లోకానికీ, పెద్దలకూ పర్వతాల లాంటి అభ్యంతరాలు. చిన్నవాళ్ళు పెద్ద శక్తులను ఎదుర్కొని సుఖపడడం సులువు కాదు యాలిస్ !'

యాలిస్ ముంగురులను సవరిస్తూ అతను అన్నాడు.

'అయితే మీ ఉద్దేశం ?'

'వీటన్నిటినీ కాదని — ప్రస్తుతం మా తమ్ముడికి జ్వరంగా ఉంది. ఈ పరిస్థితులలో మావాళ్ళకు నిన్ను పరిచయం చెయ్యడం సుఖాంతం కాని విషయం. నా మీద అభిమానమంతా పోగుచేసుకుని, నన్ను క్షమించి ఒక్క ఆరు నెలలు నువ్వు ఓపికపట్టాలి యాలిస్ !'

'ఆరు నెలలే ?' అనబోయింది యాలిస్. అందమైన, బలమైన ప్రసాద్ బాహువులు ఆమెను ఏమీ అడగనియ్య లేదు. అత డామెను దగ్గిరగా తీసుకున్నాడు.

కాలానికి దేనితోనూ సంబంధం లేదు. మరి మూడు నెలలు గడిచాయి. కారు హారన్ వినిపించింది. యాలిస్ గది తలుపు తెరిచింది. ప్రసాద్ లోపలి కొచ్చాడు. గదంతా కలయ జూశాడు.

'రూం ఎంత నీటుగా సద్దుకున్నావ్ యాలిస్ ? నిన్ను మా యింటికి తీసుకెళ్ళే అదృష్టం నా కింకా కలుగలేదు. నిన్ను యీ అద్దె యింట్లో ఉంచవలసి వచ్చిందని నేను కుమిలిపోని క్షణం లేదు.'

యాలిస్ ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసి యిచ్చింది.

'కేరియరు సరిగ్గా వేళకు తెస్తున్నాడా ?' తల ఊపింది యాలిస్.

'ఈ ప్రేమికుడు బీదవాడైతే నువ్వు చెప్పలేని బాధలు పడి ఉందువు. కాని నిన్నే విధంగానూ శ్రమ పెట్టే అవసరం రాలేదు నాకు. మా నాన్నకి నీ ధర్మమా అని మూడు మిల్సు ఉన్నాయి. నే ఒస్తాను మరి. కాలేజీకి టైమైంది.'

ప్రసాద్ బూట్సు చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

అలాగే అతను కొన్నాళ్ళు ప్రతిరోజూ, అప్పుడప్పుడు వారానికో రోజూ వచ్చి ఏం కావాలో కనుక్కుని వెళ్ళిపోతుండేవాడు.

'అమ్మగారూ, కేరియరు పడేస్తారా?' దాసీది కేకేసింది. యాలిస్ చూసింది. తనింకా తిననే లేదు. అది నిండుగానే వుంది. రెండు పూటలూ తినడం, పడుకోడం—యిదేనా జీవితం? ప్రసాద్ తన్ని నిజంగానే ప్రేమిస్తున్నాడా? లేక అబద్ధాలు చెప్పి మోసబుచ్చు తున్నాడా? నిజంగా మోసబుచ్చదల్చుకుంటే తన్ని ఆర్ఫనేజ్‌నుండి బహిష్కరించిన నాడే నడివీధిలో వదిలెయ్య వచ్చును. తనకి వేరే యిల్లు చూసి సదుపాయాలు చూడడం దేనికి?

'నేను మోసపోయానా?' అని ప్రశ్నించుకుంటూ యాలిస్ రోజులు కష్టంగా గడిపింది. 'ఇప్పుడైనా ప్రసాద్ నాలుగు రోజులు వరుసగా రాకపోతే మనస్సు శంకిస్తుంది. నేను అగాధంలో పడిపోయానా?' ఈ ప్రశ్నలతోనే యాలిస్ దినాలు గడిపింది. గడియారం తిరిగింది. కేలండరు చిరిగింది. కొత్త సంవత్సరం వచ్చింది. యాలిస్‌కి పురిటిరోజులు దగ్గిరపడ్డాయి. పదిహేను రోజులైె ప్రసాద్ రాలేదు. అవాళ ఆమెకు ఏదో చెప్పలేని బాధగా ఉంది.

'కొత్తవాళ్ళనూ, డబ్బున్న వాళ్ళనూ, మగవాళ్ళనూ నమ్మకూడదన్న పూర్వసూక్తి నిజమేనా? —... నా బ్రతుకు చీకటేనా?' అనుకుంది యాలిస్.

'నాకు పుట్టబోయే అందాలపాప నాకు చాలు. వాడి చిరునవ్వే అనాధ అయిన నాకు పదివేలు. నా కెవరూ అక్కర్లేదు!' అనుకుంది. ఇంతలో కారు వచ్చి ఆగింది. ప్రసాద్ రాలేదు. నర్సు దిగింది.

'ప్రసాద్‌గారు మిమ్మల్ని ఆసుపత్రికి చేర్చమన్నారు. మీ కేం తల్లా తండ్రా? అక్కడే పురుడు పోసుకుందురు గాని.' యాలిస్ బయల్దేరింది.

* * * *

ఆ తరువాత ఏమైంది?

తలుచుకోడానికి యాలిస్ మనస్సు నిరాకరించింది. అంతవరకు తన జీవితం పువ్వుల బాట. తరువాత ?

ఆస్పత్రిలో చేరేక, తనకి తెలివి తప్పిపోయాక — ఎప్పటికో తెలివి వచ్చింది యాలిస్‌కి. శరీరం, మనస్సు చాలా తేలిక అయిపోయినట్టని పించింది. చాలా నీర్సంగా ఉంది. క్రితం రోజు తన్ని కారు ఎక్కించిన నర్సే గ్లాసుడు ఓవల్టిన్ తెచ్చి యిచ్చింది. అది త్రాగేక యాలిస్‌కి కొంచం బలం వచ్చింది.

'ఏదమ్మా ? ఎక్కడ నా పిల్ల ? నా పాపాయి ఏదీ ?' వణికే చేతులతో యాలిస్ పక్కంతా వెతికింది. చుట్టూ చూసింది.

'నీ పురుడు చాలా కష్టమయి పోయిందమ్మా ! మత్తుమందు యియ్య వలసి వచ్చింది. అసలు నీ ప్రాణం దక్కడమే బ్రహ్మాండమయిపోయింది.'

జీవితంలో తనకున్న ఒక్క ఆశనూ కూడా ఏసు ప్రభువు తెంపేశాడా? ఇన్నాళ్ళూ తనలో పెరిగిన జ్యోతి తన కళ్ళపడకుండానే ఆరిపోయిందా ?

'అమ్మా! నాకు పుట్టినది ఆడపిల్లా, మొగపిల్లాడా? ఒళ్ళుబాగా ఉండేదా ? అందంగా ఉండేదా ? నాకు చూపించకుండా ఎందుకు పారేశారు ?'

నర్సు కోప్పడింది.

'ఈ ప్రశ్నలవల్ల లాభమేమిటమ్మా ? పోయినపిల్ల ఎలా ఉంటే నేం ? రాత్రి అనగా పోయింది. ఇప్పటివరకు ఉంచాలని మాకు తెలీదు.'

'ఆయన వచ్చారా ? పాపను చూసుకున్నారా ?'

'మాకు తెలీదు. ఆయన ముందుగానే అంత సొమ్మూ ఆస్పత్రికి చెల్లించేశారు. మళ్ళీ వచ్చినట్టు లేదు.' నర్సు మరో కేసుకు వెళ్ళి పోయింది.

యాలిస్‌కి చెప్పలేనంత దుఃఖం వచ్చింది. పుట్టిన రక్తసంబంధం ఎలాంటిదో ఆమెకు తెలీదు. ఆ జీవిత నాటకంలో ఒక సూత్రధారి ప్రవే

శించాడు. అతను ఆడేది జీవితమో, నాటకమో యింకా ఆమెకు అర్థం కాలేదు. సంఘ దూషణకూ, లోక బహిష్కారానికీ తలవంచి ఆమె తన ఆశలన్నీ పుట్టబోయే శిశువుమీదే పెట్టుకుంది. నోటిదగ్గిరకు వచ్చిన పానీయం రుచి చూడకుండా నేలపాలయింది. యాలిస్ బ్రతుక్కి ఏడుపుకాక మిగిలిందేమిటి ?

తరువాత మూడు రోజులు యాలిస్ ఆసుపత్రిలో ఎంత కష్టంగా గడిపిందో చెప్పలేము. నాల్గవరోజు నర్సు తన దగ్గరకు వచ్చింది. ఈ మూడు రోజులూ తను ఎంత చూసినా ప్రసాద్ మాత్రం రాలేదు. నర్సు రాగానే,

'ఈ దంతపు పెట్టె ప్రసాద్‌గారు మీ కిమ్మన్నారు. ఇక మీరు ఆస్పత్రి విడిచిపెట్టి వెళ్ళవచ్చు'. ఆ దంతపు భరిణ ఒకప్పుడు యాలిస్ సరదాగా ఆయన్ని అడిగింది; ఇవ్వలేదు, ఆమె ఎంతో ఆతృతతో దాన్ని అందుకుంది.

'ఇది నీ కెప్పుడిచ్చారు ! ఆయన ఎక్కడున్నారు ?'

'ఆయన గురించి ఏ భోగట్టాలూ మాకు తెలియవు. ఆయన ఎడ్రసు అసలు తెలియదు. ఈ భరిణమాత్రం మీ కిమ్మన్నారు.'

యాలిస్ ఆస్పత్రి ఆవరణదాటి యివతల కొచ్చింది. విశాల విశ్వంలో అడుగు పెట్టింది. దంతపు భరిణ విప్పి చూసింది – చిన్న ఉత్తరం.

'డియర్ యాలిస్ ! ప్రేమకోసం తల్లిదండ్రుల్నీ, సంఘాన్నీ కాదనే శక్తి నాలో లేదు. నేను నిన్ను పెళ్ళి చేసుకోవడం లోకసమ్మతంకాని విషయం. అలా చేసే స్థోమత నాకు లేదు. మన మధ్య యిప్పుడు ఏ బంధాలుకూడా లేవు. నన్ను మరచిపో. ఇంకా యిరవై ఏళ్ళయినా లేని అబలవు. ఇంకెవరినేనా పెళ్లాడి సుఖించు. ఈ విషయాలు ఎదురుగుండా చెప్పలేకపోయాను. క్షమించు; ప్రసాద్.'

కళ్ళు తిరుగుతున్నాయేమో అనిపించి యాలిస్ తల పట్టుకుని ఒక చెట్టుక్రింద కూలబడింది.

'ఎంత క్రూరం! ఎంత మోసం! ఎంత దగా!' యాలిస్ పళ్ళు పట పట కొరికింది. ఆ క్షణంలో ఆమెకు ప్రసాద్‌మీద ప్రేమంతా ద్వేషంగా, కోపంగా మారిపోయింది.

ఈ దుర్మార్గుడు, అన్నెం పున్నెం ఎరగని తన్ని మోసంచేసిన యితను-- ఇలా సుఖపడవలసిందేనా? మరో పిల్లని పెళ్లాడి హాయిగా ఉండవలసిందేనా? అతను రాసినట్టు వారిద్దరి మధ్యా ఏ బంధమూలేదా? తొమ్మిది నెలలు పెనవేసుకున్న మనస్సులు — ఒక్క ఉత్తరంతో వేరైపోతాయా?

యాలిస్ తన అసహాయస్థితికి వెక్కి వెక్కి ఏడిచింది.

తనను ప్రకృతి ఎందుకు దుఃఖపెట్టాలి? ఏ సుప్రభువు యింత నిర్దయుడై తననీ, తన పిల్లనీ ఎందుకు వేరుచేయాలి? ఏవిధంగానైనా ప్రసాద్‌పై పగ తీర్చుకుంటే తనకు మిగిలేదేమిటి?

నిజంగా తన పిల్ల పోయిందా? పుట్టి బుద్ధెరిగిన తరువాత తను ఒక నాడూ జ్వరంతోనైనా బాధపడి యెరగదే. తన పురుడు కష్ట మెందుకయింది? తనకు మత్తుమం దెందుకు యివ్వాలి? తన పిల్ల శవాన్నైనా తనకు కనిపించకుండా ఎందుకు చెయ్యాలి? తననీ, తన పిల్లనీ ఎవరు వేరు చేశారు?

ఏమి తోచిందో యాలిస్ పరుగు పరుగున ఆస్పత్రివైపు పరుగెత్తింది. అదృష్టంకొద్దీ నర్సు ఆస్పత్రి గేటుదగ్గిరే కనుపించింది. యాలిస్ ఆమె రెండు చేతులూ పట్టుకుంది.

'నిజం చెప్పు నర్సమ్మా? నిజంగానే నా పాప పోయిందా?'

'ఎన్నిసార్లు చెప్పాలి? మీ పిల్లను మేమేం తీసి దాచేశామనుకున్నావా? తెలియని ఏ వెధవకో శరీరాన్ని అర్పించి — పిల్లాడిని కని — వాడితో ఈ

సంఘంలో హాయిగా బ్రతుకుదా మనుకున్నావా ? ఈ పరిస్థితుల్లో పుట్టిన శిశువు పోవడమే నీకెంతో మేలుకాదా ?'

యాలిస్ అభిమానం దెబ్బతింది. ఆమె కష్టంగా కన్నీళ్ళు ఆపుకుంది.

'ఆడపుట్టుక పుట్టి యీ మాత్రం జాలి లేదమ్మా ! నేను చేసినది ఘోర పాపమే. ఒప్పుకున్నాను. కాని నా ప్రాణంలో ప్రాణం నా పాపని వేరు చేసుకోగల నామ్మా ! నర్సమ్మా, నా కథ నువ్వు ఎరగవు. ఆప్తులంటే ఎలా ఉంటారో, నిష్కల్మషంగా ప్రేమించే హృదయం ఎలా ఉంటుందో తెలియని అభాగ్యురాలు యిది. కష్ట నిష్ఠురాలకూ భయపెట్టే మనస్సు నీడలకూ ఓర్చి తొమ్మిది నెలలు దేనికోసం భరించాను ? నా పాపను చూడాలని, పాలివ్వాలని — నా హృదయం కొట్టుకుంటోంది. చెప్పమ్మా. నా ఒంట్లో ఏం అనారోగ్యంగా ఉందని మత్తుమందిచ్చారు ? నా పాప నేం చేశారు ?'

నర్సు మాటాడలేదు. యాలిస్ మెడలో ఉన్న గొలుసువైపు చూస్తోంది.

'ఈ గొలుసు కావలిస్తే తీసుకో — నిజం చెప్పు. నా పాప ఏమైంది ?'

మానవత్వానికి లొంగని నర్సు ధనంముందు దాసోహ మంది.

'అయితే విను. నేను చెప్పినట్టు ఎక్కడైనా చెప్పేవంటే నాకే ముప్పు వస్తుంది. నీకు చక్కని మొగపిల్లవాడు పుట్టేడు. ఆ ప్రసాద్‌గారే వచ్చి పిల్లవాడ్ని తీసుకున్నారు. ఆసుపత్రి స్టాపు నోరుమూయించడానికి ఆయన వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టేరు.'

'నిజంగా నాకు చక్కని పాప పుట్టేడా ?'

'నీకు — ప్రపంచంలో నీలాంటి ఊరూ పేరూ, దిక్కూ మొక్కూ లేని వాళ్ళకి పిల్లలు పుట్టినా లేనట్టే లెక్క. నీకు పాపాయి పుట్టిపోయినట్టు అప్పుడే ఆసుపత్రిలో రికార్డయిపోయింది.'

'అయితే తల్లికీ పిల్లకీ సంబంధం లేదా ?'

'లేదు. నీలాంటి దిక్కులేని వాళ్ళ 'మొర'లు ఏ ఏసుక్రీస్తూ ఆలించడు. మీలాంటి వాళ్ళు బ్రతకటమే తప్పు. పైగా సుఖజీవనాలకోసం ఆశించడమే పొరపాటు — ఆయన ఎడ్రస్ అయినా తెలియకుండా ఆయన ఊరూ పేరూ తెలుసుకోకుండా ఆయనతో నువ్వు సంసారం సాగించావు. ఎవరి తప్పు?'

'ఆయన తండ్రి ఈ ఊళ్ళో మిల్ ఓనరని చెప్పేరు. పైగా మెడికల్ కాలేజీలో యం. బీ. ఫైనలు యియర్ చదువుతున్నార్ట!'

'ఈ మాటలు నువ్వేలా నమ్మేవు? ఆయనిది ఈ ఊరే కాదు. బెజవాడలో ఒక ఐస్ ఫేక్టరీ మేనేజరని విన్నాను.'

యాలిస్ మనస్సు ఆశ్చర్య క్రోధాలతో జ్వలించిపోయింది.

'న్యాయం కోసం ప్రయత్నించకు. అన్యాయంగా జీవించటం అలవాటు చేసుకో' నర్సు గబగబా నడిచివెళ్ళిపోయింది.

*　　*　　*　　*

యాలిస్ చెప్పిన కథంతా ఆ యువక ప్లీడరు విన్నాడు.

'చూడమ్మా. నీ గాథ అంతా చాలా విషాదపూరితంగా ఉంది. నేనే గనుక రచయిత నైతే ఈపాటికి నీ కథ చక్కని నవలగా రూపొంది ఉండును. కాని నేను క్రొత్తగా ప్రాక్టీసు పెట్టిన ప్లీడర్ని. నాకూ అనేక సంస్కరణా భావాలున్నా తగిన సొమ్ము లేక ఆచరణలో పెట్టడానికి వీల్లేక పోయింది. న్యాయం సంపాదించాలన్నా ఈ రోజుల్లో డబ్బెట్టి కొనుక్కో వలసిందే. నీకు పుట్టిన బిడ్డ పోయినట్టు రికార్డయిందని చెబుతున్నావు. ఈ కేసు చాలా కష్టతరం. గెలుస్తుందని గ్యారంటీ లేదు. అనుభవం ఉన్న వాళ్ళు నిన్ను వేలతోగాని వదలరు. నాలుగొందలేనా తెచ్చి యివ్వకపోతే నీ బిడ్డ నీకు దక్కడు.'

'ఆలోచించు — వివాహ మవకుండా బిడ్డను కన్నావనే మచ్చ నీమీద ఉండనేఉంది. నిన్నాదుకునే బంధువు లెవరూ లేనే లేరంటున్నావ్...'

యాలిస్ ఇంక వినలేదు. ఇవతలి కొచ్చేసింది.

నాలుగువందల రూపాయలు ! నిజాన్ని నిజంగా నిరూపించుకోడానికి నిర్భాగ్యురాలు చేయవలసిన ఖర్చు ! ఎక్కడ్నించి ఎలా వస్తుంది ? ముందు తను జీవించడానికీ లోకంలో నలుగురిమధ్య నిలబడ్డానికీ ఎక్కడిది డబ్బు? తన ప్రాణంలో ప్రాణం, తన మానంలో భాగం, తన జీవితగానంలో రాగం తన చిన్నారి పాప తనకు ఏవిధంగానైనా దక్కే మార్గమే లేదా ? న్యాయం నశించవలసిందేనా ? తన్ని నిలువునా దహించిన నిర్భాగ్యుడు నవ్వుతూ బ్రతకవలసిందేనా ?

లేదు, లేదు. తన చిన్నారి చేతులు తన్ని పెనవేసుకోవలసిందే. ఎవ్వరూ ఆపలేరు. తన మాతృతృష్ణ ఎవ్వరూ కాదనలేరు. కాని ఎలా ? ఏవిధంగా ?

అతిదగ్గిరగా చెవులు బ్రద్దలయ్యేటట్టు కారు హారన్ వినిపించింది. ఆమె నరాలు తెగిపోయాయా అనిపించింది. లోకమంతా గిర్రున తిరుగుతున్నట్టు, హోరున అరుస్తున్నట్టు అనిపించి యాలిస్ స్పృహతప్పి పడిపోయింది.

* * * *

యాలిస్ తెలివి వచ్చేసరికి ఆమె ఒక దయామయి ఒడిలో ఉంది. అతి నీరసంగా ఉంది.

'ఎవరు మీరు ? నే నెక్కడ ఉన్నాను ?' ఆమె మాట్లాడవద్దని సౌంజ్ఞ చేసి గ్లాసుడు వేడివేడి పాలు యిచ్చింది.

'అయిదు నిమిషాల్లో నీకు ప్రాణగండమే జరిగేది. మా డ్రైవరు అతి జాగ్రత్తగా సడెన్ బ్రేకు వెయ్యబట్టి మళ్ళీ నన్ను చూడగలిగేవు. ఎవరమ్మా నువ్వు ?'

నిష్కల్మషమయిన ఆదరణ అంటే ఏమిటో ఎరగని యాలిస్‌కి యీ సౌమ్య వచనాలు నీలిమబ్బులకి చల్లగాలి స్పర్శ తెప్పించాయి. కన్నీళ్ళతో ఆమె చెంపలు తడిశాయి.

'నా పేరు మిసెస్ జార్జి. అందరూ 'మిస్సమ్మా' అంటారు. క్రైస్తవ మత ప్రచారకురాల్ని. నీకు అభ్యంతరం లేకపోతే స్వస్థత చేకూరేవరకూ నా దగ్గర ఉండొచ్చు.' యాలిస్ ఏమీ మాట్లాడలేదు. వివిధాలోచనలు ఆమెను దహించివేశాయి.

'నే నెందుకు బ్రతికాను ? ఇంకా యీ జీవితంలో ఏం మిగిలింది !'

మిస్సమ్మకు మాత్రం ఆమె ఎందుకో రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది.

'నా పేరు యాలిస్. నన్ను రక్షించిన మీరు తప్ప నా కీ లోకంలో మరెవరూ లేరు. నా మీద మీ కేమాత్రం దయ ఉన్నా యింకేమీ నన్ను అడగొద్దు.'

మిస్సమ్మ గోడనున్న చనిపోయిన కూతురు ఫొటోవంక చూసింది.

'నా రోజ్ ! మొక్క ఎదిగి, మొగ్గలు తొడిగి, పువ్వులు పూసే వసంత కాలంలో నువ్వు యీ ముసలి తల్లిని నిర్దాక్షిణ్యంగా వదిలిపెట్టి వెళ్ళిపోయావు. నా దుఃఖాన్ని మరిచిపోడానికి ఏసు ప్రభువు మరొకర్ని పంపించాడా' అనుకుంది ?

*　　　*　　　*　　　*

యాలిస్ నాటికీ నేటికీ తన దీనగాథ మిస్సమ్మకు చెప్పలేదు. దానికి కారణం ఉంది. తను జీవితంలో ఓడిపోయింది. పందెంలో ఓడిపోయిన వాళ్ళూ, పరీక్షలో ఫేలయిన వాళ్ళూ లోకం దృష్టిలో సానుభూతికి అనర్హులు. మిస్సమ్మ అలాంటిదని కాదు. తను గెలవాలి. తనకున్న న్యాయాల్ని పూర్తిగా అనుభవించాలి. అప్పుడు అంతా మిస్సమ్మకు చెప్పాలి. మొదట రెండు రోజులు ఉందామని చేరిన యాలిస్ మిస్సమ్మను విడిచిపెట్టలేకపోయింది. మిస్సమ్మ తనకు తెలిసిన మిస్ట్రెస్‌కి రాసి యాలిస్‌ను నర్సు పరీక్షకు కట్టించింది.

'నాకు యీ పరీక్ష పుస్తకాలంటే తలనొప్పి. కాని నాకు నువ్వు కావాలి. నువ్వు కావాలంటే సొమ్ము కావాలి. సొమ్ము కావాలంటే ఉద్యోగం చెయ్యాలి. ఉద్యోగం చెయ్యాలంటే పరీక్షలు ప్యాసవాలి. నిన్ను సాధించి తెచ్చుకుంటాను నా చిట్టి తండ్రీ!'

పరీక్షా ఫలితాలు తెలిసిన రెండు నెలలకి నర్సుపనిలో చేరింది. ఎలవెన్సుతో కలిపి ఎనభై యిస్తారు. అందులో పదిరూపాయిలు తను ఉంటున్న రూంకి అద్దెగా మిస్సమ్మతో దెబ్బలాడి యిచ్చేది.

'నే నెంత బుద్ధిలేనిదాన్ని? ఈ కొత్త లాంతరు ఎందుకు కొన్నాను? ఇది కొనకపోతే నాలుగు రూపాయిలు మిగిలేవిగా!' అనుకునేది. ఆనాడు ప్రసాద్ ఉత్తరంతో తనకు పంపిన దంతపు భరిణచూసి పళ్ళు పటపట కొరికేది. 'నీకూ నాకూ ఏ సంబంధమూ ఇప్పుడు లేదని ఆనాడు ఉత్తరం పంపేవు. ఆ సంబంధమేదో త్వరలో తెలియబరుస్తాను. ఈ దంతపు భరిణ లోనే నీ వినాశముందని తెలుసుకో'. ఆమె అందులో పెట్టిన సొమ్ము ప్రతి రోజు లెఖపెట్టేది. నెలకి యిరవై రూపాయిలు కూడబెట్టడం బ్రహ్మాండ మయిపోయేది. ఒక్కొక్కసారి అందులోంచి సొమ్ము తియ్యవలసి వచ్చేది.

'బాబూ, ఈ దుర్మార్గురాల్ని నువ్వు క్షమిస్తావో లేదో. నీ సొమ్ము తీసుకుంటున్నాను' అని కదిలే కళ్ళతో, వణికే వేళ్ళతో సొమ్ము తీసుకునేది. జీవితంలో మంచి చెడ్డలు యిరవై ఏళ్ళలోనే పూర్తిగా వంటబట్టిన యాలిస్‌కు — వణుకుతున్న చలిలో, కొవ్వొత్తి దీపపు వెలుగులో, రాతి గోడల గదిలో అర్ధరాత్రులు అకస్మాత్తుగా మెలకువ వచ్చేది. మిస్సమ్మ వలె ఆమె గంటలకొద్దీ బైబిలు ముందు కూర్చోలేకపోయేది. నడి వయస్సు, తన యవ్వనం, సాఫల్యం కాని తన జీవితం, పలకరించే ప్రాణి లేని అయోమయ కాళరాత్రులు! ఆ యవ్వనికి నిద్రపట్టేదికాదు. కాని ఈ కటికి చీకటి నిశరాత్రిలో వెలుగుచూపే చుక్కలు, ఈ మాలిన్య గంభీర

సముద్రపు అట్టడుగున మిలమిల మెరిసే మంచి ముత్యాలు. ఈ కారు మబ్బుల్లో మెరుపు తీగెలు ఆమె సకల దుఃఖాన్నీ పోగొట్టేవి.

'కాదు, కాదు నా ఊహలు గాలిమేడలు కావు. నావి పిచికగూళ్ళూ, పేకమేడలూ కానేకావు. ఏసుప్రభువు నాకు అన్యాయం చెయ్యడు. నా బాబుని నేను తెచ్చుకుంటాను. ఎవరూ అడ్డుపెట్టలేరు. వచ్చి నా చిట్టి నాన్న ఏం చేస్తాడు ?'

'అమ్మా అని పిలుస్తాడు. ఒక్క పిలుపుతో, ఒక్క చూపుతో నా దుఃఖాన్ని పటాపంచలు చేస్తాడు.'

'అవును. ఆ రోజు తప్పకుండా వస్తుంది. ఇంతకన్న పెద్ద ఉద్యోగం చేసి యింతకన్న ఎక్కువ మిగిల్చి నిన్ను పెద్దచదువు చదివిస్తాను. లోకమంతా గర్వించే వ్యక్తిగా తయారు చేస్తాను. 'ఎవరీ అబ్బాయి ?' అని అందరూ అడుగుతారు.' ఆమె ముఖమంతా దరహాస చంద్రికలు విరిసేవి. ఆమెకు వెంటనే నిద్రపట్టేది.

చక్కని కలలు విడిపోయాక ఆమె లేచేది. ఎప్పుడే అనుమానాలు బాధించినా మొక్కలను పెంచడంలోనూ, రోగుల సేవలోనూ వాటిని మరిచేది.

* * * *

ఏడేళ్ళు ముందుకి తిరిగి చూడగలుగుతే యీ నాడు యాలిస్ మిస్సమ్మ యిచ్చిన గదిలోనే ఉంది. ఆమె పెదవులు నిశ్చయాన్నీ, ఆమె కళ్లు పగ తీర్చుకోడాన్ని సూచిస్తున్నాయి. ఎక్కడికో ప్రయాణమౌతోంది.

'ఎందుకమ్మా శలవు పెట్టేవుట ?' అంది మిస్సమ్మ చర్చినుంచి రాగానే.

'ఒకసారి బెజవాడ వెళ్ళిరావాలి' అంది అదోలా యాలిస్.

'ఎందుకూ ?'

'మా సీనియర్ నర్సు సిస్టర్‌కి మ్యారేజ్. ఒక్క రోజు లీవు పెట్టేను.' రైలులో యాలిస్ అనుకుంది.

'బాబూ, నిన్ను చూడాలని నీ కన్నతల్లి వస్తోంది. నీ కోసం ఓ జీవి యిలా పంచప్రాణాలూ పెట్టుకుని బ్రతుకుతోందని నీ పసిహృదయానికి తెలీదు. నిన్ను పెంచి పోషించే అదృష్టం ఏ పుణ్యాత్మురాలికి కలిగిందో! ఆరేళ్ళకి నువ్వు ఎలా మారిపోయావో! నా కథ వింటే నువ్వు నన్ను ఆదరించగలవా నాయనా?'

ఎంతసేపో ప్రయాణం చేసినట్టయింది. ఆఖరికి బెజవాడ వచ్చింది. నర్సు చెప్పిన యిన్ఫర్మేషనుతో కొంచం కష్టపడి యిల్లు కనుక్కొంది. ఒక అర ఫర్లాంగు దూరంలో రిక్షా ఆపించి పంపేసింది.

అది ఒక బంగాళా. అందులోంచి రివ్వుని ఓకారు యివతలికొచ్చింది. ఆ హారన్ విని యాలిస్ గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

'సందేహంలేదు. నన్ను సర్వనాశనం చేసిన దుష్టుడిదే యీ యిల్లు. అతడే యితడు. క్రింది పెదవి నొక్కిపెట్టినపళ్ళు, ఎవరినైనా వశం చేసుకోగల ఎట్టని కళ్లు, జేబుల్లో చేతులు. ఆనాడు ఆర్ఫనేజ్‌లో చూసినట్టే ఉంది. ఈ నిర్మల బాహ్యరూప నదీజలంలో యింత లోతైన సుడిగుండ ముందని ఎవరనుకుంటారు?' అనుకుంది.

'ఇతన్ని యిలా నిలదీస్తే లాభంలేదు. ధనవంతుడు ఏమైనా చేస్తాడు. మోసాన్ని మోసంతోనే ఎదిరించాలి.'

కారు వెళ్ళిపోయేదాకా ఆమె ఆగింది. దడదడ కొట్టుకుంటున్న హృదయంతో యాలిస్ అడుగులో అడుగు వేసుకుంటూ బంగళా చేరుకుంది. గొలుసుకి కట్టబడిన ఒక కుక్క భౌ భౌ మని అరచింది.

'ఎవరది?' అంటూ యింట్లోంచి ఒకావిడ యివతలికొచ్చింది. కుక్కని రెండుకొట్టి ఊరుకోబెట్టి—

'అక్కడే నిలబడిపోయారేం ? ఇలా లోపలికి రండి' అందామె.

యాలిస్ తడబడుతూ 'ప్రసాదుగారు ఉన్నారా ?' అంది.

'లేరు, ఫేక్టరీకి వెళ్ళేరు. రండి, కూర్చోండి' ఆవిడ యాలిస్‌ను మర్యాదచేసి లోపలికి తీసుకువెళ్ళి సోఫామీద కూర్చోబెట్టింది.

'ఉండండి, వస్తాను' ఆవిడ లోపలికి వెళ్ళింది. ఆమె చాలా నిరాడంబరంగానూ, నిష్కల్మషంగానూ కనిపించింది యాలిస్‌కి. అంత యింటికీ ఒక్క నౌకరు కనిపించలేదు. ఆమె అన్నిపనులూ స్వయంగా చేసుకోడం యాలిస్‌కి ఆశ్చర్యం కలిగించింది. ఆవిడ బలవంతాన కాఫీ యిస్తూ అంది.

'ఆయనా అలా వెళ్ళేరు, మీరూ వచ్చారు. సాయంకాలందాకా సరదాగా కబుర్లు చెప్పుకుందాం. అప్పుడు ఆయన వస్తారు.'

యాలిస్ మరికొన్ని అబద్ధాలాడక తప్పలేదు.

'ఆయనా నేనూ చిన్నప్పుడు చదువుకున్నాం. ఇక్కడ ఉన్నారని తెలుస్తే ఓమారు చూసిపోదామని వచ్చాను. ఎప్పటిమాట ! ప్రసాదుగార్ని చూసి ఆరేళ్ళయింది. అప్పటికి మీ కింకా పెళ్ళి కాలేదేమో.'

'అవకేం? పదేళ్ళ క్రిందటే మా వివాహం జరిగింది' యాలిస్ పెదవులు కోపంతో కంపించాయి. పెళ్ళయిన నాలుగేళ్ళ తరవాత యీ ధూర్తుడు తన సర్వస్వాన్నీ కలుషితం చేశాడు. ఆఖరికి తన ప్రాణంలో ప్రాణాన్ని కూడా తనకు తెలీకుండా ఎత్తుకు పోయాడు !

'ఆయనకు పిల్లలంటే చెప్పలేనంత ప్రేమ. నేను కాపురానికి వచ్చిన నాలుగేళ్ళ వరకూ పిల్లలే కలుగలేదు. అన్ని సంగతులూ నేనే చెప్పేస్తున్నాను. మీరు గడుసుతనంగా మాట్లాడ్డమే లేదు !'

ఆ యిల్లాలి ఆదరణలోపడి తను వచ్చిన విషయమే మరిచి పోయింది. ఇంతకీ తనబాబు ఏమైనట్టు ? సరిగ్గా నాలుగు గంటలు కొట్టేరు.

'అమ్మా! అమ్మా!' అంటూ చిన్న పిల్లవాడు లోపలికి వచ్చాడు. ఆ వయస్సులో ఉన్న యితర పిల్లల్లా వాడు ఎగురుతూ, ఉరుకుతూ రాలేదు. అతి నెమ్మదిగా, నిదానంగా నడచుకుంటూ వచ్చి, ముందు జోళ్ళు విప్పి ఒకమూల పెట్టేడు. తరువాత సంచిలో పుస్తకాలు తీసి అలమారాలో క్రింది సొరుగులో కుడిచేతిప్రక్క మూలగా పొందికగా పెట్టేడు. తరువాత తల్లివళ్ళో వచ్చి కూర్చున్నాడు. యాలిస్ గుండె తీవ్రంగా కొట్టుకుంది.

'చూడమ్మా మోహన్‌బాబూ! కొత్తవాళ్ళు వస్తే నేనేం చెయ్యమని చెప్పేను?'

ఆ కుర్రవాడు తెల్లని తన పదివేళ్ళూ జోడించి 'నమస్తే' అన్నాడు. ముద్దుమాటలతో, 'ఇలారా నాయనా?' అంది యాలిస్. వాడు తల్లి కళ్ళ వైపు చూసి సమ్మతి గ్రహించి వెంటనే వచ్చాడు. యాలిస్ రెండు చేతుల తోనూ వాడ్ని గట్టిగా కౌగలించుకుంది. చెప్పలేనన్ని ముద్దులు కురిపించింది ఆమె చెంపలు నదీ జలాలే అయ్యాయి.

'అదేమమ్మా అలా దుఃఖపడుతున్నారు?' ఆవిడ యాలిస్ కళ్ళు తుడిచింది. కాని అవి ఆగలేదు.

నా కొడుకూ బ్రతికుంటే యిన్నేళ్ళవాడు ఔను.' అంది యింకేమీ అనలేక.

'మాతృప్రేమ అంటే నాకూ తెలీదమ్మా, ఆరేళ్ళ క్రిందట ఆర్ఫనేజ్ నుంచి ఆయన యీ పసిగుడ్డును తెచ్చేరు. కలతపడిన హృదయంలా ఉంది మీది. మీ దగ్గిర ఏ విషయమూ దాచబుద్ధి పుట్టడంలేదు. వీడ్ని కన్న తల్లి ఎవరో నిజంగా ధన్యాత్మురాలు'.

యాలిస్ మొహం వివర్ణమయింది. విషయం మార్చుదామని 'ఏం చదువుతున్నావు బాబూ నువ్వు?' అని అడిగింది.

'ఒకటి' అన్నాడు మోహన్. దుస్తులుగాని, క్రాఫింగుగాని ఒక్క పిసరు మాయలేదు. అంత చక్కటి శిక్షణకి యాలిస్ జోహారు చేసింది.

'వీడు పాఠం చదువుతాడు వింటారా ? బలే తమాషాగా చదువుతాడు లెండి. ఏది మోహన్ మీ వాచకంలో మొదటి పాఠం చదువమ్మా.'

వాడు మఠం వేసుకున్నాడు. చేతులు కట్టుకున్నాడు. బుద్ధిగా ముద్దొస్తూ చిలకపలుకుల్తో మొదలుపెట్టేడు. ఆ పాఠమంతా మూడే ముక్కలు. యాలిస్ మాతృహృదయం పూర్ణ స్వరూపాన్ని చూడడానికి అవి చాలు.

'మా అమ్మ చాలమంచిది. నన్ను చెప్పలేనంత ప్రేమించును. నా కొరకు ఎంత కష్టమయినను ఓర్చును.'

ఈసారి యాలిస్ కన్నీళ్ళు ఆగలేదు. వాడ్ని దగ్గిరగా తీసుకుని భోరున ఏడ్చేసింది. అయిదు నిమిషాల్లో అతికష్టపడి ఆపుకుని 'ఇక ఉండలేనమ్మా వెళ్ళి వస్తాను. మోహన్‌బాబు ఫొటో ఒకటి ఉంటే యివ్వండి...వస్తాను.' ఆవిడ ఫోటో తీసియిచ్చింది.

'ఆయన వచ్చేదాకా ఉండరూ ?'

'ఎందుకని అడగొద్దు, చిన్న కోరిక. నే యిలా వచ్చి వెళ్ళినట్టు ఆయనకి చెప్పవద్దు. ఇది తీరుస్తారని నమ్మకముంది...వస్తాను.'

'మీ హృదయం ఎందుకింత బాధపడుతూందో నాకు అర్థం కాలేదు. నా వల్ల తెలీకుండా మీకేదైనా అపకారం జరుగుతే క్షమించండి. మీరు కూర్చున్న కొద్దిసేపూ ఎవరో ఆత్మీయులతో మాట్లాడుతున్నట్టు ఉంది. తప్పకుండా మీ కోరిక చెల్లిస్తాను. మీరు మళ్ళీ మళ్ళీ వస్తే ఎంతో సంతోషిస్తాను.' యాలిస్ కళ్ళెత్తి చూసింది. ఆవిడ కళ్ళలో నీళ్ళు! తన కన్నీళ్ళకి విలువుంది. అర్థంకాని ఆ బాధకు ? దానికి విలువెంత ?

'మోహన్‌బాబూ నమస్తే చెప్పమ్మా.' వాడు అతిముద్దుగా చెప్పేడు.

యాలిస్ తిరిగి చూడలేక పోయింది. త్వరత్వరగా అడుగులు వేసుకుంటూ వచ్చి కనపడిన రిక్షాలో కూర్చుని 'స్టేషనుకు పోనియ్' అంది.

*   *   *   *

యాలిస్ యిల్లు చేరుకునేసరికి తనకోసం ప్లీడరు కనిపెట్టుకుని కూర్చున్నాడు. యాలిస్ వస్తూనే 'నేనే పొరపడ్డాను. మీ అవసరం లేదు. దయ ఉంచి వెళ్ళిపొండి' అంది. యాలిస్ సామాను గదిలోపెట్టి తాళం వేసుకుని మేడమెట్లు దిగింది. త్వరత్వరగా ఆవరణ దాటింది. మళుపు తిరిగి, చిన్న టర్నింగు గేటు తీసుకుని చర్చిలోకి వచ్చింది. ఏసుక్రీస్తు శిలా విగ్రహం ముందు ఆమె ఆఖరి నివేదన యిది :

'మారిన వయస్సులూ మనస్సులూ మావి, కాని నీ శిలాస్ఫటిక నిర్మల రూపం ఒక్కలాగే ఉంది ప్రభూ : నేను జయించింది — నా మనస్సును ఓడించింది పగ కాదు, మంచితనం, త్యాగం. డబ్బు కుమ్మరించి నా బాబును నేను తెచ్చుకుంటాను. ఏం సుఖం ? ఈ బీద నిర్భాగ్యురాలు వాడి కేం యివ్వగలదు ? నెలకి ఎనభై గడించే యీ అమ్మ వాడి ముద్దుముచ్చట్లు ఏం తీర్చగలదు ? వీటన్నిటిని మించి వాడి కిప్పుడున్న అమ్మ ఎంత మంచిది ! అంత చక్కగా, అంత మంచి శిక్షణతో ఎలా పెంచగలను ? మా బాబు పంచదార పలుకులు ఏ సందేశాన్ని యిస్తున్నాయి ? అమ్మ చాలా మంచిది ! ఆ మాటలు అబద్ధం కాకూడదు. వాడి ఉన్నతికి నా స్వసుఖం అడ్డురాకూడదు. నేను కోరిన సుఖంకంటె యింకొకరికిచ్చే సుఖమే ఎక్కువని తెలుసుకున్నాను ప్రభూ.' ఆమె హృదయం పరిపూర్ణతతో నిండిపోయింది.

*   *   *   *

చర్చిలో గంటలు కొట్టేరు. ప్రార్థనా గీతాలు చక్కని సంగీతంలా, చల్లని పరిమళంలా వినిపిస్తున్నాయి. యాలిస్ ఇల్లు చేరుకుంది. ఆమె కళ్ళలో ఆ కొత్తవెలుగేమిటో మిస్సమ్మకు అర్థంకాలేదు !

★